క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా చేపట్టిన ప్రచార భేరీలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ఉదయం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వీధుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎల్.రాము, గోవిందు, ఎస్.రమణ, జి.శ్రీను పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసనం



సుభద్రాపురంలో చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

లావేరు: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాళ్లవలస సచివాలయం ఎంఎస్‌కే ఎన్ కామేశ్వరీ అన్నారు. సుభద్రాపురం, రావివలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీబీ ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రసాన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఉచితంగా అందజేస్తున్న పాలు, గుడ్లతో పాటు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

23న మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

లావేరు: శ్రీకాకుళంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు మహాలక్ష్మి కోరారు. లావేరు గ్రామంలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర, సభ్యులు కళావతి, సూర్యకుమారి, రాజ్యలక్ష్మి, అప్పచ్చమ్మ, మంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మసీదును సందర్శించిన యువ విద్యార్థులు



మసీదులో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు

శ్రీకాకుళం: నగరంలోని ప్రసిద్ధ జామియా మసీదును ఠాగూర్ స్కూల్‌కు చెందిన యువ టూరిజం క్లబ్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి ఆధ్వర్యంలో సందర్శించిన విద్యార్థులకు మసీదు ప్రెసిడెంట్ మహిబూల్లా ఖాన్ చరిత్ర, నిర్మాణ శైలి తదితర విషయాలను వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ ఖాజీ ఇమామ్ అబ్దుల్ అహాబ్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో మసీదు వైస్ ప్రెసిడెంట్ అక్బర్ బాషా, డైరెక్టర్ శాలిహుండం రవికుమార్, కరస్పాండెంట్ పి.సత్తిబాబు ఉన్నారు.

కమ్మసిగడాం విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతి



వెంకయ్యనాయుడును కలిసిన ఈశ్వరరావు

రణస్థలం: జిల్లా పర్యటనలో భాగంగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకటయ్యనాయుడు కమ్మసిగడాం గ్రామానికి బుధవారం విచ్చేశారు. బీజేపీ నాయకుడు ఇందుకూరి మహేష్‌రాజు ఫాంహౌస్ విశ్రాంతి తీసుకున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్.ఈశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు

సీఎం జగన్‌తో అధికారులు, నేతలు

















సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు నాయకులు, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, స్వామి వివేకానంద అవార్డు గ్రహీత గురుగుబెల్లి లోకనాథం తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

-శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ), జి.సిగడాం

ప్రజల వద్దకే సంక్షేమం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- కోటపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



దివ్యాంగుడికి సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు చేరువ అవుతున్నాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కోటపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి.. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను చదివి వినిపించారు. లబ్ధి చేకూరిందా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలుంటే చెప్పాడమ్మా అని పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు. వీధి కాలువలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలన్నీ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశ్వీరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, పైడి శ్రీనివాసరావు, చిల్లా వెంకటరెడ్డి, పిల్ల ఆనందరావు పాత్రుడు, గొర్లె తిరుపతినాయుడు, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, ఎంపీటీసీ సభ్యుడు సుంకరి కిశోర్‌కుమార్, గ్రామ నాయకులు చౌదరి రాము, శశిభూషణనాయుడు, గొర్లె అప్పలనాయుడు, రామచంద్రునాయుడు, నాగరాజు, జోగి శ్రీనివాసరావు, అదపాక శ్రీరాములు, ప్రసాద్, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య సర్వే



చినలింగాలవలసలో సర్వే చేస్తున్న సభ్యులు

లావేరు: పెదలింగాలవలస, చినలింగాలవలస గ్రామాల్లో సెంట్రల్ టీమ్ సభ్యులు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను బుధవారం చేపట్టారు. పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడుతో టీమ్ సభ్యులు సమావేశమై సర్వే ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అనంతరం ఈటీమ్ సభ్యులు యాళ్ల కిరణ్‌కుమార్, ఉదయ్‌కిరణ్, వంశీలు స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి, అనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా మ్యాపింగ్ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం అల్లాడ సుజాత, విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, పార్టీ నాయకులు మీసాల నారాయణరావు, యందవ శ్రీను, చిలకలపల్లి దామోదరరావు, పతివాడు గురునాయుడు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎచ్చెర్ల క్యాంపస్: గ్యాస్‌తో మంటలు అదుపు చేస్తున్న విద్యార్థులు



శ్రీకాకుళం క్రైమ్: మెడికవర్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



రణస్థలం: అగ్ని ప్రమాదాల నివారణపై డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలు ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, లీడింగ్ అండ్ మిషనరీ, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫైర్ నియంత్రణ పరికరాలను ఎలా వినియోగించాలో అగ్నిమాపక సిబ్బంది డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ శృంగారనాయుడు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సన్‌రైజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ సంస్థ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ భాస్కర్ హాజరై విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవల్సిన చర్యలు, నియంత్రణ పద్ధతులపై వివరించారు. ఫైర్ బెల్ వినియోగం, గ్యాస్‌తో మంటలు అదుపు వంటి వాటిపై విద్యార్థులతో డెమో చేపట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

రణస్థలం: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జె.ఆర్.పురంలోని సూర్య ఆస్పత్రిలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని రణస్థలం అగ్నిమాపక కేంద్రం అధికారి పైల అశోక్ అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల వినియోగం తెలుసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో రోగులను ఎలా రక్షించాలి, నివారణ చర్యలను డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో ఇడదాసుల సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

27 నుంచి విద్యుత్ వైరింగ్‌లో శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండల కేంద్రం సమీపంలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 27వ తేదీ నుంచి జిల్లా గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. అభ్యర్థులు పదో తరగతి చదివి జిల్లా వాసులై ఉండాలన్నారు. బీపీఎల్ రేషన్‌కార్డు కలిగి, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిన వారు అర్హులన్నారు. వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గోరుముద్ద పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని సంబంధిత ఏజెన్సీలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో అరసాడ రవి సూచించారు. బాతువ ఎంపీపీ పాఠశాలలో గోరుముద్ద పథకాన్ని బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉత్తరావల్లి భాగ్యలక్ష్మి ఉన్నారు

కార్మికులకు పనిదినాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

రణస్థలం: యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు డిమాండ్ చేశారు. యూబీ కార్మికుల సమస్యలపై బంటుపల్లి జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా పరిశ్రమ యాజమాన్యం పూర్తిస్థాయి పనిదినాలు కార్మికులకు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నైరా గ్రామంలో స్థానిక సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేయగా.. వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ఎవరూ దాహార్తితో నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండ నుంచి రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రమౌళి, గ్రామపెద్దలు కర్రి కృష్ణమోహన్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

గడప గడపలో 'జగనన్నే మా భవిష్యత్తు'



లావేరు: గోడకు స్టిక్కర్లు అతికిస్తున్న నాయకులు



జి.సిగడాంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు



జి.సిగడాం: నడిమివలసలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు తదితరులు



శ్రీకాకుళం అర్బన్: కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: మురపాక గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు.. మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధవారం నిర్వహించారు. సచివాలయం కన్వీనర్లు బాలి శ్రీనివాసనాయుడు, తేనేల నీలిమ, విద్యాసాగర్, పెయ్యల లక్ష్మణరావు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు గురించి తెలియజేశారు. ఇంటి యజమానుల అనుమతితో జగనన్న స్టిక్కర్లను గోడలకు, సెల్ ఫోన్లకు అతికించారు.

జి.సిగడాం: జి.సిగడాం, నడిమివలస, సంతవురిటి, ఆనందపురం, వాండ్రంగి, జాడ, ఎందువ గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజా సర్వే చేశారు.

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం 25వ డివిజన్‌లో మాజీ కౌన్సిలర్, డివిజన్ ఇన్‌చార్జి తెలుగు అప్పలసూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడపై అతికించారు. వార్డు ప్రతినిధులు బైరి రామకృష్ణ, జగన్నాథం, కుంచాల మల్లేశ్వరరావు, గుడ్ల రాంబాబు, మజ్జి లక్ష్మి, నిద్దాన శిరీష తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



బలగలో స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం



పాతశ్రీకాకుళంలో గణపతి హోమం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు అయ్యప్ప స్వామి దేవాలయాల్లో స్వామివారికి బుధవారం అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. బలగ దేవాలయంలో అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామిని ఆభరణాలతో అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావు పాల్గొన్నారు. అలాగే పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో కూడా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా గణపతి హోమం చేశారు. అలాగే స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన



సీతంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

జి.సిగడాం: సచివాలయాల సిబ్బంది సక్రమంగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సీతంపేట, సంతవురిటి, టీడీవలస, కొత్తపెంట సచివాలయాలను బుధవారం సందర్శించారు. వలంటీర్ల పనితీరుపై దృష్టి సాధించాలన్నారు. సచివాలయంలో వారి హాజరు పట్టికలో కూడా సంతకాలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు పొట్నూరు సురేష్‌కుమార్, వైదేహి, హిమబిందు ఉన్నారు.

కుష్టువ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి

- జిల్లా అధికారి అనూరాధ



బాలికను పరీక్షిస్తున్న దృశ్యం

జి.సిగడాం: కుష్టువ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కుష్టువ్యాధి నివారణాధికారి ఎస్.అనూరాధ చెప్పారు. జిల్లాలో 179 మందిని వ్యాధిగ్రస్తులుగా గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. నిద్దాం గ్రామంలో స్థానిక వైద్యాధికారులు పొన్నాడ హరితాశ్రీ, యశ్వంత్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై బుధవారం చేపట్టిన ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యాధులపై సర్వే చేయిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధి అదుపులో ఉందన్నారు. 179 మందిలో 99 కేసులు అదుపులో ఉన్నాయని.. మిగతా 80 కేసులకు చికిత్స అందిస్తున్నామన్నారు. నిద్దాం గ్రామంలో ఇంటింటా సర్వే చేయడంతో నాలుగు కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గతంలో కూడా గ్రామంలో 11 కేసులు ఉండగా.. వీటితోపాటు మరో నాలుగు కేసులు ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయితే పాత వ్యాధిగ్రస్తులు మందులను వాడటంతో వ్యాధి అదుపులోకి వచ్చిందన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీలు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎన్‌వో ప్రవీణ్, డీపీఎంవో సాంబమూర్తి, డీపీఎంలు పాపినాయుడు, రవిచంద్ర, సూపర్‌వైజర్లు పేడాడ సత్తెరాజు, భాస్కరరావు, రమాదేవి, ఉమా ఉన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.